క్లుప్తంగా

బెంచీలు అందించి.. బాధలు తీర్చి



విద్యార్థులతో కూర్చున్న రఘునాథ్

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బెంచీలు లేక నేలపై కూర్చుని ఇబ్బందులు పడుతున్నారు. వారి బాధలు తీర్చేందుకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ముందు కొచ్చారు. మోదీ జన్మదినం సందర్భంగా వెరబెల్లి పౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2.5లక్షలు విలువ చేసే 30డ్యూయల్‌డెస్క్ బెంచీలను బుధవారం పాఠశాలకు డొనేట్ చేశారు.

ఓపెన్ జిమ్ సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్: మండలంలోని మాదారంటౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. పల్లె ప్రకృతి వనాన్ని మెరుగుపర్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సూరం దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంబులెన్స్ తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

భీమారం: మండల కేంద్రంలోని అంబులెన్స్‌ను బుధవారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయ అధికారి కిషోర్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా కోఆర్డినేటర్ సంపత్ తనిఖీ చేశారు. అంబులెన్స్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంబులెన్స్‌లో వినియోగించే పరికరాల పనితీరును, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

డైలీవేజ్ వర్కర్ల నిరసన



నిరసన తెలుపుతున్న వర్కర్లు

పాతమంచిర్యాల: తెలంగాణ గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే డైలీవేజ్, కాంటింజెంట్ పార్ట్‌టైం వర్కర్లకు టైం స్కేల్ ఇవ్వాలని గిరిజన ఆశ్రమ పాఠశాలల, హాస్టల్ వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వర్కర్లు సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ హాస్టల్, ఆశ్రమపాఠశాలల డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ నాయకులు భీమయ్య, భీంరావు, లక్ష్మణ్, భాగ్య, సత్తక్క, బొజ్జుబాయి, సంధ్య, సరస్వతి, శంకర్, మోతీరాం, రాంబాయి పాల్గొన్నారు.

వీడీసీలపై కేసు నమోదు చేయాలి

వేమనపల్లి: నిజామాబాద్ జిల్లా తాళ్ల రాంపూర్‌లో గౌడ కులస్తులపై దాడికి పాల్పడ్డ వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేయాలని గౌడ జన హక్కుల పోరాట సంఘం మోకుదెబ్బ మండల అధ్యక్షుడు తిరుపతిగౌడ్ డిమాండ్ చేశారు. ధస్నాపూర్‌లో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. గౌడ కులస్తులపై దాడి చేసి బైకులు, ఫర్నిచర్ ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, రాముగౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

పెరియార్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాతమంచిర్యాల: సామాజిక విప్లవ యోధుడు పెరియార్ రామస్వామి జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దేవి పోచన్న, సత్యనారాయణ, సురేష్, శ్రీధర్, లక్ష్మణ్, కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో...



మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ భవన్‌లో...



లక్సెట్టిపేట: మున్సిపల్ కార్యాలయం వద్ద...



మందమర్రిరూరల్: వేడుకల్లో జీఎం రాధాకృష్ణ

పోరాటాల త్యాగఫలమే తెలంగాణ

- ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: ప్రజాపాలన వేడుకలను ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రంగుల జెండాను ఆవిష్కరించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఎంతోమంది పోరాటాల త్యాగఫలమే నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నాటి నిజాం సంస్థానం నుంచి తెలంగాణ స్వేచ్ఛావాయువులు లభించిన ఈ దినం చరిత్రాత్మకమన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది అమరులయ్యారన్నారు. వారి పోరాటాల ఫలితంగానే నేడు మనస్వరాష్ట్ర పాలనలో ఉన్నామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, శ్రీరాంపూర్‌లో జీఎం శ్రీనివాస్, జైపూర్‌లో ఏసీపీ వెంకటేశ్వర్, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, మందమర్రిలో ఏరియా జీఎం రాధాకృష్ణ, మంచిర్యాలలో జెడ్పీ సీఈవో గణపతి, గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీఐలు, ఎస్సైలు, ఎంఈవోలు, మున్సిపాలిటీల అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జైపూర్: ఎస్టీపీపీలో జెండాకు గౌరవ వందనం చేస్తున్న అధికారులు



శ్రీరాంపూర్: జెండా ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాస్



మంచిర్యాలటౌన్: జెండా ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈవో గణపతి, సిబ్బంది



రామకృష్ణాపూర్: జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్

తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర కీలకం

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



జెండా ఆవిష్కరిస్తున్న దివాకర్‌రావు

నస్పూర్: తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. నస్పూర్‌లోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అవిశ్రాంత పోరాట ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసమర్థపాలన వల్ల తెలంగాణ అభివృద్ధిలో వెనుకపడిందని విమర్శించారు. కార్యక్రమంలో నస్పూర్ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, గాదె సత్యం, మాజీ కౌన్సిలర్ వంగ తిరుపతి, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, నాయకులు మేరుగు పవన్‌కుమార్, గోగుల రవీందర్‌రెడ్డి, బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పంబాల ఎర్రయ్య, కుర్మిల్ల మోహన్, ఆకునూరి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



బెల్లంపల్లి: నినాదాలు చేస్తున్న నాయకులు



సీసీసీ కార్నర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

తాండూర్/దండేపల్లి/రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఎగురవేసి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్లనే తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ, రక్తదానం కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల కేకులు కట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని మంచిర్యాల జిల్లా కేంద్రంలో బోయిని హరికృష్ణ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి దేవాలంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో పార్టీ పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, తాండూర్‌లో మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, హాజీపూర్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, శ్రీరాంపూర్‌లో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్‌రావు, మాజీ ఉపాధ్యక్షులు జీవీ ఆనంద్‌రావు, పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, ప్రధాన కార్యదర్శి సదయ్య, బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నర్సింగాపూర్‌లో జెండా ఆవిష్కరణ



భీమారంలో వేడుకల్లో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు



జెండా ఆవిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు



జన్నారంలో...

వైభవంగా విశ్వకర్మ జయంతి

భీమారం/మందమర్రిరూరల్/పాతమంచిర్యాల/భీమిని/జన్నారం/జైపూర్/నెన్నెల/శ్రీరాంపూర్/దండేపల్లి/చెన్నూర్: విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. పంచరంగుల జెండాను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో విశ్వకర్మ విగ్రహం శోభాయాత్ర నిర్వహించి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. శ్రీరాంపూర్‌లోని పలు గనులు, డిపార్టుమెంట్లపై బీఎంఎస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్కే న్యూటెక్ గనిపై ఆ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటి ఇంజనీర్ విశ్వకర్మ అని, సమస్త పనిముట్లకు సృష్టికర్త అన్నారు. శ్రామిక వర్గానికి ఆరాధ్యుడని ఆయన జయంతిని సింగరేణి కార్మిక దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీ ఆధ్వర్యంలో విశ్వకర్మపూజ నిర్వహించారు. ఆయా డిపార్టుమెంట్ల వారీగా కార్మికులు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులుతో పాటు పవర్‌మేక్ కంపెనీ అధికారులు, ఉద్యోగులు, సింగరేణి అధికారులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ విశ్వకర్మ జయంతి వేడుకలకు హాజరై పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.



జైపూర్: పవర్ ప్లాంటులో విశ్వకర్మపూజ



దండేపల్లిలో....

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు

పాతమంచిర్యాల: విమోచన కాదు.. విలీనం కాదు.. ముమ్మాటికి విద్రోహ దినమే అని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తెలంగాణలో 3వేల గ్రామాలు విముక్తి పొందాయని తెలిపారు. 10లక్షల ఎకరాల భూమి నిరుపేదల వశమైందన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు మంగ, రాజేశ్వరీ, సత్యవతి, అంజన్న, స్వప్న, రవి, సత్యనారాయణ ఉన్నారు.

- జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట వీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, దుంపల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



పాతబెల్లంపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పాతబెల్లంపల్లిలో ఎర్ర జెండా ఎగురవేశారు. సాయుధ పోరాట వీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల రాజేశం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు ఆటంకం

- ఇరువర్గాల మధ్య గొడవ
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని రెండు రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరగా బుధవారం ఘటనా స్థలానికి స్థానిక ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావ్ వచ్చి ఇరువర్గాలతో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిగించారు. వివాదానికి సంబంధించిన వివరాల్లోకెళ్తే.. రాజీవ్‌నగర్‌లో కొన్ని సంవత్సరాలుగా గణేశ్, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 22న దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు కాలనీవాసులు మండపం ఏర్పాటు చేసే క్రమంలో ఓ వర్గానికి చెందిన వారు మండపాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. గొడవ పోలీస్‌స్టేషన్‌కు చేరగా ఏసీపీ, సీఐలు ఇరువర్గాలతో చర్చించారు. గొడవలు జరగకుండా, అన్నివర్గాల ప్రజలు మతాలకతీతంగా పండుగలు నిర్వహించుకోవాలని, మతపరమైన గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాష్

పౌష్టికాహారం అందించాలి



తాండూర్: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

తాండూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులకు సరైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, పుష్పలత, స్వరూప, రాధిక సూచించారు. మండలంలోని కిష్టంపేట రైతువేదికలో నిర్వహిస్తున్న పోషణ బి-పడాయి బి శిక్షణ తరగతులు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఈ నెల 17నుంచి అక్టోబర్ 16వరకు నిర్వహించే పోషణ మాసం కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. పౌష్టికాహార పంపిణీపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాండూర్, మాదారం, కాసిపేట సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దండేపల్లి: పోషణ మాసోత్సవ కార్యక్రమాల నిర్వహణపై దండేపల్లి ఉన్నత పాఠశాలలో దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల పోషణపై సలహాలు అందించడంతో పాటుగా పౌష్టికమైన అనుబంధ ఆహార పదార్థాల గురించి అంగన్‌వాడీలకు వివరించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మమత, వాణి, వెంకటలక్ష్మి, రమా, పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్ రావు, బ్లాక్ కోఆర్డినేటర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో శిశు, మహిళా, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ బి-పడాయ్ బి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ బోధన, నిర్వహణపై అవగాహన కల్పించి, చిన్నారులకు వివిధ రకాల బొమ్మలను తయారు చేసి చేపట్టే బోధనను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, చందన, ఇందిర, సంధ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న ఏరియా జీఎం ఆఫీస్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఏరియాలోని కేకే-5 గని వద్ద బుధవారం ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

కాటమయ్య కిట్లపై శిక్షణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని తాటివనంలో బుధవారం 87మంది గౌడన్నలకు రక్షణలో భాగంగా ఎక్సైజ్ శాఖ, బీసీ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో కాటమయ్య కిట్లపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పొందిన గీతకార్మికులకు కాటమయ్య కిట్లను అందజేశారు. 135కిట్లు అందజేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీహరి తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం రాధాకృష్ణ



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. శ్రీరాంపూర్, మందమర్రి జీఎం కార్యాలయాల వద్ద బుధవారం స్వచ్ఛతాహి సేవా, స్పెషల్ క్యాంపెయిన్ 5.ఓ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ఉద్యోగులతో వారు స్వచ్ఛత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో శ్రీరాంపూర్‌లో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్రెడ్డి, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్ కుమార్, మందమర్రిలో ఎస్వోటు జీఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ వెంకటరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విలీన దినోత్సవం

చెన్నూర్: పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు తెలంగాణ విలీన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య జాతీయ జెండాను ఎగరవేశారు.